ప్రజాశక్తి
సోమవారం 22 సెప్టెంబర్ 2025 5
అనంతపురం

కిమ్స్ స(చా)వేరా..!

ధర్మవరం మహిళ మృతిపై వివాదం

ప్రజాశక్తి-అనంతపురం

కిమ్స్ సవేరాలో మరో మరణం వివాదాస్పదమైంది. గురువారం రోజు ఛాతి సంబధమైన జబ్బుతో ఆసుపత్రిలో చేరిన ఒక మహిళ ఆదివారం మృతి చెందింది. ఈ మృతి ఆసుపత్రి నిర్లక్ష్యం కారణంగానే జరిగిందని మృతురాలి బంధువులు ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళన చేస్తున్న వారికి సర్దిజెప్పే ప్రయత్నం చేశారు. దీనికి సంబంధించి బాధితుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

ధర్మవరం ప్రాంతానికి చెందిన పార్వతి (50) అనే మహిళ గురువారం తీవ్ర అస్వస్థతకు గురైంది. ఊపిరితిత్తుల సమస్య తీవ్రమవడంతో అనంతపురానికి తీసుకొచ్చారు. ఇక్కడ రాత్రి సమయంలో వైద్యసేవలు అందించే పరిస్థితి లేకపోవడంతో అంబులెన్సు డ్రైవరు సూచన మేరకు సవేరా ఆసుపత్రికి రాత్రి 11.30 గంటలకు చేరుకున్నారు. మెరుగైన వైద్య సేవలందిస్తామని చెప్పి అడ్మిషన్ చేసుకున్నారని పార్వతి బంధువు గాయత్రి తెలిపింది. చేరినప్పటి నుంచి మందులకు డబ్బులు కట్టించకుంటూనే ఉన్నారని అయితే ఆ మందులు వాడకుండా తిరిగి ఫార్మసీకే సిబ్బంది చేరుస్తున్నారని ఇది గమనించి సిబ్బందిని ప్రశ్నించామని చెప్పారు. ఇలాగైతే తాము డబ్బులు కట్టలేమని, పార్వతికి వేరే ఆసుపత్రికి తీసుకెళుతామని చెప్పామన్నారు. బయట అంబులెన్సులోకి వచ్చాక రోగిని చూస్తే పల్స్ కొట్టుకోవడం లేదని గాయత్రి తెలిపింది. పార్వతి చనిపోయి ఉంది కదా వైద్యం ఏ రకంగా అందించారంటూ వైద్యులను ప్రశ్నిస్తే ఎమర్జెన్సీలోకి తీసుకెళ్లి పిసిఆర్ చేసారని చెప్పారు. తరువాత చనిపోయిందని చెప్పి మృతదేహాన్ని అప్పగించారని వాపోయింది. ఎప్పుడో చనిపోయినప్పటికీ చనిపోలేదని తమ నుంచి రెండు లక్షల రూపాయల వరకు డబ్బులు వసూలు చేసారని ఆరోపించింది.

అంబులెన్సులో తీసుకొచ్చాక గుండెపోటు వచ్చింది : ఆసుపత్రి వైద్యులు

ఆమె ఆసుపత్రిలో చేరే సమయంలోనే పరిస్థితి విషమంగా ఉందని బంధవులకు తెలియజేసామని ఆసుపత్రి వైద్యులు ఒకరు మీడియాకు తెలిపారు. అయితే ఆమెను ఇక్కడ చికిత్స అందివ్వలేమని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళుతామని బంధువులు చెప్పిన సమయంలోనూ వెంటిలేటర్ నుంచి బయటకు తీస్తే పరిస్థితి విషమంగా ఉండే అవకాశముందని బంధువులకు సూచించామని చెప్పారు. అయినా వారు తీసుకెళుతామని చెప్పడంతో పార్వతిని అంబులెన్సులో తీసుకెళ్లడానికి కిందకు తీసుకొచ్చామన్నారు. అంతలోపే ఆమెకు గుండెపోటు వచ్చి పరిస్థితి విషమంగా మరి చనిపోయిందన్నారు. ఇందులో తమ తప్పులేదని ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లు

అధికారులు తొలగించిన గోడను అనుమతులు లేకుండా కడుతున్న దృశ్యం (ఫైల్‌ఫోటో)

ఉమ్మడి జిల్లాలో అక్రమ లేఅవుట్‌లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా అక్రమ లేఅవుట్లు వేసిన రియల్టర్లు... ఇప్పుడు కూటమి నేతలతో అంటకాగుతూ అనుమతులు లేకుండా ఇళ్ల స్థలాల లేఅవుట్లు వేస్తున్నారు. అభూత ప్రకటనలతో ప్రజలను నమ్మించి, ప్లాట్లను విక్రయిస్తున్నారు. అహుడాతో పాటు పంచాయతీల పరిధిలో వందల సంఖ్యలో అక్రమ లేఅవుట్‌లు వేసిన రియల్టర్లు.. వీటిల్లో కొన్నింటికి మాత్రమే అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం. అనుమతి లేకుండా వెంచర్లు వేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. వీరందరికీ అధికార పార్టీ నేతల అండదండలు ఉండడంతో అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి నిదర్శనం.. హిందూపురం పురపాలక సంఘం పరిధిలోని సర్వే నెంబరు 374లోని సుమారు 2.40 ఎకరాల స్థలంలో అక్రమంగా లేఅవుట్ వేశారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో ఇటీవల టౌన్ ప్లానింగ్ అధికారులు వెళ్లి లేఅవుట్ ప్రహరీని తొలగించారు. అయితే మళ్లీ వారు ప్రహరీ నిర్మాణానికి పూనుకోవడం గమనార్హం. దీన్నిబట్టి చూస్తే అధికార పార్టీ నేతల అండదండలు వారికి ఏస్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

ప్రజాశక్తి-హిందూపురం

స్థానిక రాజకీయ నాయకుల అండదండలతో జిల్లాలో అక్రమ లే అవుట్లు యథేచ్ఛగా వెలుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అధికార పార్టీ నేతల సిఫార్సులతో కొందరు ఇష్టారీతిన స్థలాల విక్రయాలు జరుపుతున్నారు. కొన్నిచోట్ల రాజకీయ నాయకులే అక్రమ లే అవుట్లను వేస్తూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రభుత్వాదాయానికి పెద్దఎత్తున గండి పడుతోంది. గత నాలుగైదు సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో సైతం రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగా జరుగుతోంది. మారుమూల ప్రాంతాల్లో సైతం లే అవుట్లు వెలుస్తున్నాయి. పచ్చని పంట పొలాలను మట్టితో కప్పుతూ ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నారు. రహదారి వెంబడి భూములను మార్కెట్ ధరల కంటే అధికంగా కొనుగోలు చేస్తూ స్థలాలుగా విభజించి రెండు మూడురెట్లు అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. పట్టణాలకు సమీప గ్రామాల్లో పల్లె వాతావరణంతో పాటు, అన్ని రకాల వసతులు ఉండటంతో ఇళ్ల నిర్మించుకునేందుకు అక్కడ పలువురు స్థలాలను ఎంచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పలు చోట్ల నిబంధనలకు విరుద్ధంగా లే అవుట్లు సాగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవటం లేదన్న విమర్శలున్నాయి. ఫలితంగా రియల్ వ్యాపారులకు కాసులు కురుస్తుండగా ప్రభుత్వ ఆదాయానికి మాత్రం గండి పడుతోంది. అనధికార లేఅవుట్లలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనంతపురం, గుంతకల్లు, ఉరవకొండ, కళ్యాణదుర్గం, పెనుకొండ డివిజన్ వ్యాప్తంగా హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజక వర్గాల పరిధిలో అన్ని పంచాయతీల పరిధిలో పదుల సంఖ్యలో లేవుట్లు వెలుస్తున్నాయి. అయితే అనంతపురం–హిందూపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (అహుడా) ఆధ్వర్యంలో హెచ్చరికలు జారీ చేసినప్పటికీ సంబంధిత యజమానులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. స్థలాలు గానీ, ప్లాట్లు గాని కొనుగోలు చేయడం చట్ట విరుద్ధమని ప్రకటిస్తున్నప్పటికీ యజమానులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యవసాయ భూమిలో ప్లాట్లు వేసి విక్రయించాలంటే ముందుగా అనేక రకాల అనుమతులు తీసుకోవాలి. అయితే జిల్లాలో కొన్నేళ్లుగా సాగుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిబంధనలను తుంగలోకి తొక్కుతున్నారు. స్థానిక పంచాయతీ అధికారులకు ముడుపులు ముట్టజెప్పి స్థలాల అమ్మకాలు సాగిస్తూ జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో అనేకచోట్ల ఇదే తంతు సాగుతున్నా జిల్లా ఉన్నతాధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లాలో వెలుస్తున్న అక్రమ లేఅవుట్లలో స్థలాల విక్రయాలు జరిగిపోతున్నాయి.

సడ్లపల్లి వద్ద వెలసిన అక్రమ లే అవుట్ గోడను జెసిబితో తొలగిస్తున్న అధికారులు (ఫైల్‌ఫోటో)

రియల్టర్లకు అధికార పార్టీ నేతల అండదండలు

పురపాలిక, పంచాయతీల ఆదాయానికి గండి

అంతే కాకుండా రాజకీయ నాయకుల సిఫార్సులతో ఆయా కాలనీల్లో స్థానిక అధికారులు అన్ని వసతులు కల్పిస్తున్నారు. తద్వారా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కోల్పోతోంది. వాస్తవానికి అనుమతులు లేని లేఅవుట్లలో ఇంటి స్థలాలు కొనుగోలు చేయడం వలన భవిష్యత్తులో ఆయా పంచాయతీల ఆధ్వర్యంలో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం ఉండదు.

అసలు లేవుట్లు ఎక్కడెక్కడ వేశారు

హిందూపురం రూరల్ మండలంలో కిరికెర పంచాయతీలో పదుల సంఖ్యలో అక్రమ లేవుట్లు వెలిశాయి. గతంలో ఒక సారి జిల్లా పంచాయతీ అధికారి తనిఖీ నిర్వహించి చర్యలు చేపట్టారు. వారు వెళ్ళిన అనంతరం అదే తంతు కొనసాగుతోంది. కె.బసవనపల్లి, కిరికెర, తూమకుంట పారిశ్రామికవాడ, బెంగళూరు రహదారితో పాటు పరిగి మండల పరిధిలోని మడకశిర జాతీయ రహదారిలో లే అవుట్లు వెలిశాయి. చిలమత్తూరు మండలంలో ఏకంగా జాతీయ రహదారి పక్కలోనే ఎల్పిన రాగమయూరి పరిశ్రమకు కేటాయించిన భూమిలో ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారు. మడకశిర మండలంలో సుమారు 15పైగా లేవుట్లు ఉంటే ఇందులో అక్షరాల రెండింటికి మాత్రం అనుమతులు ఉన్నాయి. హిందూపురం పురపాలక సంఘంలో 128 అక్రమ లే అవుట్లను అధికారులు గుర్తించారు. ఇదే పరిస్థితి అన్ని ప్రాంతాల్లో ఉంది.

ఇప్పటి దాకా ఏం జరిగింది

గత నాలుగు సంవత్సరాలుగా పెనుకొండ రెవిన్యూ డివిజన్ వ్యాప్తంగా ఉన్న అన్ని పంచాయతీ, నగర పంచాయతీల పరిధిలోని వందల ఎకరాల్లో సాగు భూమిని ఇళ స్థలాల కోసం ప్లాట్లుగా వేసి విక్రయిస్తున్నారు. లే అవుట్ అప్రూవల్ కోసం గ్రామ పంచాయతీ కార్యాలయాలకు వెళ్లడం లేదు. లాభాపేక్షతో తక్కువ విస్తీర్ణంలో అంతర్గత రోడ్లు వేయడంతో పాటు కనీస మౌళిక వసతులు కల్పించకుండానే ప్లాట్లు అమ్ముతున్నారు. కమ్యూనిటి అవసరాలకోసం స్థలం వదలాల్సి వస్తే వారికి అవసరం లేని ప్రాంతాలలో వదులుతున్నారు. కొనుగోలు దారులు అప్రూవల్‌ను అడగక పోవడంతో వ్యారస్తులు అనుమతులు తీసుకోవడం మానేశారు.

ల్యాండ్ కన్వర్షన్ అనుమతులు లేకుండానే...

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో కూడా రియల్ ఎస్టేట్ వెంచర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా పలు మండలాల్లో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు, వివిధ ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు పొందకుండానే భారీ లేఅవుట్లు వేసి ప్లాట్లను విక్రయిస్తున్నారు. నిబంధల ప్రకారం తొలుత వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చాలి. 33 అడుగుల వెడల్పుతో బీటీ రోడ్లు, మురుగు నీటి పారుదలకు కాలువల నిర్మాణాలు చేపట్టాలి. లేఅవుట్‌లో విద్యుత్ స్తంభాలు వేసి, తాగునీటి సరఫరాకు ఏర్పాట్లు చేయాలి. లేఅవుట్‌లో పది శాతం భూమిని సామాజిక అవసరాలకు విడిచిపెట్టాలి. గ్రామీణ ప్రాంతాల్లో లేఅవుట్లకు ముందుగా పంచాయతీలో తీర్మానం చేసిన తరువాత సాంకేతిక పరిశీలన పూర్తయిన తరువాత అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. అదే మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో కూడా సంబంధిత అధికారుల నుంచి అనుమతులు పొందాలి. కానీ రియల్టర్లు ఇవేమీ పట్టించుకోవడం లేదు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారుల అండతో పన్ను చెల్లించకుండానే వెంచర్లు వేస్తున్నారు. వేసిన ప్లాట్లు అమ్ముకుని సొమ్ము చేసుకొంటున్నారు. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన లక్షలాది రూపాయాల ఆదాయానికి గండిపడుతోంది.

అక్రమ లే అవుట్లపై చర్యలు

అనధికార అక్రమ లే అవుట్లలో స్థలం లేదా ప్లాట్లు వేసినా చట్ట విరుద్ధం. వాటిపై చర్యలు తప్పవు. ఎలాంటి భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయం. అనధికారికంగా లే అవుట్లు వేసి అమ్మకాలు చేస్తే స్థల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

మల్లికార్జున,
హిందూపురం మున్సిపల్ కమిషనర్

వ్యవసాయ శాఖ కార్యాలయం ఎక్కడ ..?

ప్రజాశక్తి - పెద్దవడుగూరు

నారాయణ : ఒరేయ్ గోవిందు...మనూర్లో వ్యవసాయ శాఖ ఆఫీస్ ఎక్కడుందిరా .. ?

గోవిందు : భలే వోడురా నారాయణా...కరెంట్ ఆఫీసు పైన ఉందే అదే కదరా..

నారాయణ : మరి అక్కడ బోర్డు కూడా లేదు గదరా...

గోవిందు: ఓ యబ్బా అక్కడ బోర్డు లేక ఏడాదిపైనే అయింది.. ఎవరూ బోర్డు ఏయాలని అనుకోలేదు.

నారాయణ : పెద్దవడుగూరులో ఉండేవాళ్ళకు రోజూ వచ్చిపోయే వాళ్ళకి ఆఫీసు ఎక్కడుందో తెలుస్తుంది. మనలాంటి పల్లెటూరోళ్లకి ఎట్లా తెలిసేదప్పా.... దాని మొగాన ఓ బోర్డు కూడా ఏయలేరా...?

గోవిందు : అవన్నీ ఎందుకురా...మనలాంటోళ్ళు ఎన్ని అనుకున్నా ఏమి జరగదు గాని ఎల్లి పనిసూసుకో..

ఇది మండలంలోని చింతలచెరువుకు చెందిన ఇద్దరు రైతుల సంభాషణ..స్థానిక బస్టాండ్ వద్ద చెట్టుకింద నిలబడి ఈ ఇద్దరు రైతులు మాట్లాడిన తీరు ఇది..మండలకేంద్రమైన పెద్ద వడుగూరు లో మండల వ్యవసాయ శాఖ కార్యాలయం ఉంది. అక్కడ అధికారులు..సిబ్బంది ఉన్నారు. అయితే ఆకార్యాలయానికి బోర్డు లేదు. మండల వ్యవసాయ శాఖ అధికారులతో పని ఉండి వచ్చే మండలంలోని 39 గ్రామాలకు చెందిన రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయం ఎక్కడుందో తెలియక తికమక పడుతున్నారు. అడ్రస్ కోసం స్థానికులను అడిగి తెలుసుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రజలకు ఇబ్బంది లేకుండా వ్యవసాయ కార్యాలయానికి ఒక బోర్డు ఏర్పాటు చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యుత్ కార్యాలయం పైన బోర్డు లేకుండా ఉన్న వ్యవసాయ శాఖ కార్యాలయం

ఆర్‌డిటిని కాపాడకపోతే ప్రజా తిరుగుబాటు

'సేవ్ ఆర్‌డిటి' అఖిలపక్ష కమిటీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు తెలుగు రాష్ట్రాల్లో ప్రజలకు రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ (ఆర్‌డిటి)ను కాపాడకపోతే ప్రజా తిరుగుబాటు తప్పదని సేవ్ ఆర్‌డిటి అఖిలపక్ష కమిటీ నేతలు హెచ్చరించారు. సేవ్ ఆర్‌డిటి నినాదంతో అఖిల పక్ష కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఈనెల 23న కేంద్ర కార్యాలయాల ముట్టడి, 26 రైల్‌రోకో, 29 జాతీయ రహదారి దిగ్బంధం, అక్టోబర్ 5న జైల్‌బరో, అక్టోబర్ 7న చలో అసెంబ్లీ కార్యక్రమం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, జెవివి రాష్ట్ర నాయకులు డాక్టర్ గేయానంద్, మాజీ ఎంపి తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, టిడిపి అనంతపురం పార్లమెంట్ అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్, వైసిపి పిఎసి మెంబర్ మాజీ ఎమ్మెల్యే వై విశ్వేశ్వర రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల రంగయ్య, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, జనసేన పార్టీ చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ సాకే శంకర్, ఇమామ్, బిఎస్పి గద్దల నాగభూషణం, సిపిఐ ఎంఎల్ వేమన, ఎమ్మార్పీఎస్ నాయకులు బిసిఆర్.దాస్, అక్కులప్ప, కెపి.నారాయణస్వామి, కుంటిమద్ది ఓబులేసు, సామ్రాట్ మధు, ఐఎంఎం బాషా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక కేవీ రమణ, జి.నారాయణ రెడ్డి, రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు రామచంద్ర, రెడ్స్ భానుజా తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను ప్రేమించడమే నిజమైన దేశభక్తి

జెవివి రాష్ట్ర గౌరవ సలహాదారు డాక్టర్ ఎం.గేయానంద్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్. గేయానంద్

మతాల పేరుతో సమాజంలోని ప్రజలను విడదీసే కంటే అందరని సమంగా, ప్రేమతో చూడడమే నిజమైన దేశభక్తి అని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవ సలహాదారు డాక్టర్ ఎం.గేయానంద్ పేర్కొన్నారు. జెవివి నగర కమిటీ ఆధ్వర్యంలో మహాకవి గురజాడ అప్పారావు 164 వ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక గిల్డ్ఆఫ్ సర్వీస్ స్కూల్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుషుల మధ్య మానవత్వం ఉండాలే తప్ప మతం కాదని వందేళ్ల క్రితమే గురుజాడ తెలియజేశారన్నారు. ఆనాడు సమాజంలో ఉన్న అశాస్త్రీయ రుగ్మతలను తొలగించేందుకు,ప్రజలను చైతన్యవంతుల్ని చేసేందుకు తన రచనల ద్వారా విశేషంగా కృషిచేసిన నవయుగ వైతాళికుడు గురజాడ అని అలాంటి వ్యక్తి మన గడ్డపై జన్మించడం మనకు గర్వకారణమని అన్నారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 21 గురజాడ అప్పారావు జయంతిని రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని,విజయనగరంలో ఆయన నివసించిన గృహాన్ని ప్రభుత్వం పరిరక్షించి స్మారక కేంద్రంగా ప్రకటించాలని విజయనగరంలో గురుజాడ అప్పారావు పేరుతో సాంస్కృతిక విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ తీర్మానించినట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. నగర కార్యదర్శి సాకే తిరుపాల్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా గౌరవాధ్యక్షురాలు డాక్టర్ పి.ప్రసూన, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరరాజు, జిల్లా నాయకులు ఎస్.గాంగేనాయక్, డాక్టర్ కిషోర్, నగర అధ్యక్షులు ప్రసాద్ రెడ్డి, కోశాధికారి రామిరెడ్డి, నాయకులు నాగరత్న, లలిత, రామకృష్ణ, శివచరణ్, నూర్‌మొహమ్మద్, ముత్యాలన్న, రాజేష్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే కార్మికుడికి గాయాలు : సిఐటియు

ప్రజాశక్తి - రాప్తాడు

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పశ్చిమ బెంగాలకు చెందిన ప్రయివేటు కార్మికుడు గాయాల పాలయ్యాడని ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మన్నీల రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని హంపాపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 33 కేవీ ఫిట్టింగ్ పనులను గోపాల్ అనే కాంట్రాక్టర్ తన కూలీలలో చేయిస్తున్నాడన్నారు. పనుల సందర్భంగా సబ్ స్టేషన్‌నుంచి ఎల్‌సి తీసుకున్నామని విద్యుత్ అధికారులు చెప్పడంతో పశ్చిమ బెంగాల్ కు చెందిన ఎస్కే. బైసి అనే కార్మికుడు శనివారం సాయంత్రం ఎస్వీఐటీ కళాశాల వెనుక వైపు 11 కేవీ విద్యుత్‌స్తంభం ఎక్కి పనులు చేస్తున్నాడన్నారు. అయితే ఈసమయంలో సబ్ స్టేషన్ సిబ్బంది నిర్లక్ష్య కారణంగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో స్తంభంపైనున్న కార్మికులు షాక్‌కు గురై తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. మండల విద్యుత్ ఏఈ నిర్ల్యక్ష్యం కారణంగా తాను చేయాల్సిన పనికి కింది స్థాయి సిబ్బందికి చెప్పడంతోనే ఈ ప్రమాదం జరిగిందని విమర్శించారు.

ప్రస్తుతం కార్మికుడి పరిస్థితి విషమంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారన్నారు. గతంలో కూడా మండల విద్యుత్ ఏఈ శివప్రసాద్ నాయుడు రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంఘటలను కూడా ఉన్నాయని విమర్శించారు. . జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఎఇ వ్యవహార శైలిపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గాయపడిన కార్మికుడి వైద్య ఖర్చులన్నీ ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో. సిఐటియునాయకులు సుబ్బారావు, లక్ష్మన్న, అమర్నాథ్, శివకుమార్, వెంకట రాముడు నారాయణస్వామి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి

ఎన్టీఆర్ వైద్యసేవల జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ శ్రీదేవి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవల వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగమని ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ వైద్యసేవల జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ శ్రీదేవి తెలిపారు. గతంలో ఈ పథకానికి డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ అని పేరు ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలు అని పేరు పెట్టారు. గతంలో కంటే ఈ పథకంలో మరిన్ని విస్తృత సేవలను పొందుపరిచారు. సమాజంలో కాలానుగుణంగా ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. పూర్వం పెద్దలు చిరుధాన్యాలు పండించి వాడటం, తద్వారా పౌష్టిక ఆహారం పొందడంతో రోగాలు దరిచేరేవి కావు. దీంతో పాటు వారు శారీరకంగా బలిష్టంగా ఉండేవారు. కానీ ప్రస్తుతం అలాంటి చిరుధాన్యాలు దొరకడమే గగనమైంది. ఉరుకులు పరుగులతో జీవితం యాంత్రికమైంది. ప్రతి వస్తువు కల్తీమయం కావడంతో రోగ నిరోధక శక్తి తగ్గిపోవడంతో కొత్త కొత్త రోగాలు కూడా వస్తున్నాయి. డబ్బులు ఉన్నవారు పెద్దపెద్ద కార్పొరేట్ ఆసుపత్రులలో తమ రోగాలను నయం చేసుకుంటున్నారు. అదే పేదలు, సామాన్యులు అయితే కార్పొరేట్ వైద్యం చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్న వారి వైద్య ఖర్చులను భరించి భరోసా కల్పించడమే ఎన్టీఆర్ వైద్య సేవల ప్రధాన ఉద్దేశం. ఈ నేపథ్యంలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలపై ఆ పథకం జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ శ్రీదేవి ప్రజాశక్తి కి ఇచ్చిన ప్రత్యేక ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను ప్రస్తావించారు.

ప్రశ్న: ఎన్టీఆర్ వైద్య సేవల కోసం బాధితులు ఎవరికి దరఖాస్తు చేసుకోవాలి? ఈ పథకానికి ఎవరు అర్హులు?

జవాబు : ఈ పథకం ద్వారా చికిత్సలు పొందడానికి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ హెల్త్ కార్డులో పేరు ఉన్న ప్రతి ఒక్కరు అర్హులే. ఇందుకోసం బాధితులు తమ హెల్త్ కార్డును తీసుకొని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలకు గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్ కౌంటర్లలో సంప్రదించాలి. అక్కడ ఉన్న వైద్యమిత్రలతో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకుంటే ఆ రోగి ఆయా ఆసుపత్రులలో ఉచిత చికిత్సలు పొందవచ్చు. గతంలో డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నవారు కూడా ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందవచ్చు. ప్రభుత్వం జారీ చేసిన ఆధార్ కార్డులో రోగి పేరు ఉండాలి. అదే పేరు హెల్త్ కార్డులో కూడా నమోదై ఉండాలి. ప్రతి ఆర్థిక సంవత్సరం, ప్రతి కుటుంబం రూ. 25 లక్షల వరకు ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చు.

ప్ర : కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ పథకంలో జరిగిన ముఖ్యమైన మార్పులు, కొత్త విధానాలు వివరించండి?

జ : కూటమి ప్రభుత్వం ఈ పథకంలో అనేక మార్పులు, విధానాలను అమలులోకి తెచ్చింది. ఈ ఏడాది 2025 ఏప్రిల్ 1 నుంచి కొత్త హైబ్రిడ్ విధానం తీసుకువచ్చింది. ఈ విధానంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యువజనతో కలిపి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలతో పాటు ప్రయివేటు బీమా సంస్థల భాగస్వామ్యంతో ఈ కొత్త హైబ్రిడ్ విధానం అమలులోకి తెచ్చారు. దారిద్ర రేఖకు దిగువ ఉన్న కుటుంబాల వారు ఈ పథకం ద్వారా రూ.25 లక్షల వరకు ఉచిత చికిత్స పొందవచ్చు. రాష్ట్రంలో అర్హులైన వారిని ఇంటింటి సర్వే ద్వారా ఎఎన్‌ఎంలు సర్వే చేసి పీఎం జే ఏ వై హెల్త్ కార్డులను మొబైల్ యాప్ ద్వారా ఈ కేవైసీ చేసి కార్డులను ఇస్తున్నారు.

ఎన్టీఆర్ వైద్యసేవల జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ శ్రీదేవి

ప్ర : ప్రభుత్వం వైద్య సేవల సంఖ్యను మరింత పెంచి అందిస్తున్న సేవలు ఏమిటి?

జ: ఈ రూ.25 లక్షల పథకం కాక ఏ సామాజిక వర్గానికి చెందిన వారైనా ఆదాయంతో సంబంధం లేకుండా 70 సంవత్సరాలు పైబడిన వయోవృద్ధులు, రిటైర్డ్ ఉద్యోగులు ఏడాదికి రూ.5 లక్షల వరకు పిఎంజెఎవై హెల్త్ కార్డు ద్వారా దేశంలో ఏ ఆసుపత్రిలోనైనా వైద్యం పొందవచ్చు. రూ. 5 లక్షల వరకు ప్రభుత్వమే భరిస్తుంది. అలాగే రాష్ట్రంలో ఉన్న పేద ప్రజలందరికీ స్మార్ట్ హెల్త్ కార్డులను అందించే ప్రక్రియను కూటమి ప్రభుత్వం చేపట్టింది. ఇటీవలే సుమారు రాష్ట్రంలోని 5 కోట్ల మంది ప్రజలకు ఉచిత నాణ్యమైన వైద్య చికిత్సలు అందించడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రోగి ఆసుపత్రిలో చేరిన 6 గంటల లోపే వైద్య అనుమతులు ఇవ్వాలని నిర్ణయించారు. వైద్య సేవలు మొత్తం సంఖ్యను 3,257 వరకు పెంచారు. భవ్య హెల్త్ కేర్ సర్వీస్ సంస్థకు 108 సేవలను ప్రభుత్వం బదలాయించింది. అవసరమైన నూతన ఆంబులెన్సులను కొనుగోలు చేయడం జరిగింది.

ప్ర: జిల్లాలో కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకు ఎంతమంది లబ్ధి పొందారు? వినియోగించిన మొత్తం ఎంత?

జ: జిల్లాలో ఇప్పటివరకు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవల వల్ల 13,338 మంది లబ్ధి పొందారు. వీరి కోసం ప్రభుత్వం మొత్తం 20.06 కోట్ల రూపాయలు వినియోగించింది.

ప్ర: ఉచిత వైద్యసేవలు పొందడానికి ఏయే బిల్లులను సమర్పించాల్సి ఉంటుంది?

జ: ప్రభుత్వం విస్తృతంగా వైద్య సేవలును పెంచడం వల్ల ఏ ఆసుపత్రిలోనైనా చికిత్సలు పొందవచ్చు. అక్కడ ఉన్న వైద్య మిత్రలే అవసరమైన బిల్లులు ప్రభుత్వానికి అందజేస్తారు.

ప్ర: మీ శాఖకు జిల్లా కేంద్రంలో కార్యాలయం ఉందా? సిబ్బంది కొరత ఉందా? ప్రజలకు మీరు ఇచ్చే సలహా ఏమిటి?

జ: జిల్లా కేంద్రంలో మా కార్యాలయం లేదు. ప్రస్తుతం హిందూపురం నుంచే పర్యవేక్షిస్తున్నాము. అక్కడ మా కార్యాలయం కొత్త ఎంసిహెచ్ భవనంలో ఉంది. మా చిరునామా డాక్టర్ శ్రీదేవి, జిల్లా సమన్వయ అధికారి, సెల్ నెంబర్ 9281068500 కు ఫోన్ చేసి వివరాలు పొందవచ్చు. మా శాఖలో ఇంకా జిల్లాలో 12 మంది వైద్య మిత్రలకొరత ఉంది. ప్రభుత్వానికి నివేదించాము. ఈ వైద్య సేవలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాము.

ప్రజాశక్తి www.prajasakti.com

విలువలతో కూడిన అంశాలను బోధించాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి-తాడిపత్రి

విద్యార్థులకు తరగతి గదుల్లోనే విలువలతో కూడిన అంశాలను బోధించాలని జనవిజ్ఞాన వేదిక (జెవివి) వ్యవస్థాపక అధ్యక్షులు డివై వెన్నపూస బ్రహ్మారెడ్డి సూచించారు. ఆదివారం పట్టణంలోని పద్మవాణి హైస్కూల్‌లోని ఆడిటోరియంలో తాడిపత్రి జెవివి శాఖ అధ్వర్యంలో ఉపాధ్యాయులకు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవిత అవసరానికి కావాల్సిన నైపుణ్యాలను విద్యార్థులకు క్లాస్ రూములోనే అందించాలన్నారు. ముఖ్యంగా విద్య, నైపుణ్యం, మానవ సంబంధాలు, విలువలతో కూడిన అంశాలను బోధించాలన్నారు. ర్యాంకులు, మార్కులతో విద్యావిధానం ఉండటం వల్ల కేవలం విద్యార్థులను డబ్బులు సంపాదించే యంత్రాలుగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకోలేని స్థితిలో వివాహ బంధం విఫలం కావడం, విడాకులు వంటి కారణాలు పెరిగాయన్నారు. దీనికితోడు ఆత్మహత్యలు సాగుతున్నాయన్నారు. కావున వీటన్నింటింపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జి.నాగపీరయ్య, ఎవి రమణయ్య, గోపాల్‌నాయక్, జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు సీతు రామేశ్వరరెడ్డి, రాష్ట్ర ప్రధాన కండొళ్ళె విశ్వనాథ్, ఇస్మాయిల్, జెవివి గౌరవాధ్యక్షులు మహ్మద్‌మయా, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యవాళ్లి శిరరెడ్డి, శ్రీరాములు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

13 గంటల పని విధానాన్ని రద్దు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శాసనసభలో బిల్లు పాస్ చేసిన 13 గంటల పని విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు, వెంకట నారాయణ, ముత్తుజా ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కార్మికులందరూ కూటమి ప్రభుత్వానికి అధికారం ఇచ్చింది 8 గంటల పని విధానాన్ని 13 గంటలకు పెంచడానికేనా.. అని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వస్తే పని భారం తగ్గిస్తామని, కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక కేవలం కేంద్రంలోని బిజెపి మెప్పు కోసం రాష్ట్రంలోని కార్మికులు, ఉద్యోగులను యజమానులకు బలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 13 గంటలు పని, 6 గంటలకు ఒకసారి అర్ధగంట రెస్ట్ ఇవ్వాలి, వారానికి 60 గంటలు మించకుండా పని చేయించాలనే ఆలోచన మంచిది కాదన్నారు. మహిళలకు పట్టపగలే సరైన రక్షణ కరువైన పరిస్థితుల్లో రాత్రి సమయాల్లో పని చేయాలాని బిల్లు ప్రవేశపెట్టి పాస్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా కూటమి నాయకులు స్పందించి తక్షణమే ఆ బిల్లును ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

సలకంచెరువు చెరువుకు నీరు నింపుతాం

జలవనరుల శాఖ డిఇఇ రాజేష్‌కుమార్ యాదవ్

నీరొచ్చే మార్గాలను పరిశీలిస్తున్న జలవనరుల శాఖ అధికారులు

ప్రజాశక్తి-శింగనమల

25ఏళ్ల తర్వాత 5వ డిస్ట్రిబ్యూషన్ బైపాస్ కెనాల్ ద్వారా సలకం చెరువు గ్రామంలో ఉన్న చెరువుకు నీరు నింపుతామని జలవనరుల శాఖ సహాయ ఇంజినీర్ రాజశేఖర్ కుమార్ యాదవ్ అన్నారు. ఈమేరకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాలతో మండల పరిధిలోని గోవిందరాయునిపేట, సోదనల్లి రైతుల తోటల మీదుగా వెళ్తున్న కాలువను పరిశీలించారు. ఇందులో భాగంగా సలకంచెరువు చెరువుకు సాగునీరు నింపడానికి అవకాశం ఉన్న మార్గాలను నీటి పారుదలశాఖ అధికారులు సాయినాథ్, రాజ్‌కుమార్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చెరువుకు నీరు రావడానికి రెండు మార్గాలు ఉన్నాయని గుర్తించారు. శింగనమల చెరువు తూము నుంచి ఒక మార్గం, ఎంపీఆర్ డ్యాం నుంచి కాలువల ద్వారా నీరు మరోమార్గం ద్వారా చెరువును నింపవచ్చని తెలిపారు. ఈ అంచనాలను ఉన్నతాధికారులకు పంపుతామని ఇంజినీర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు అట్టే రామాంజనేయులు, తిరుపాలు, ఏకిల ఆదినారాయణ, పుల్లయ్య, రమేష్, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధి శిక్షణ

సర్టిఫికెట్లతో విద్యార్థినులు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ఎస్‌వి, డిగ్రీ, పిజి కళాశాలలో ఎపిఐటి, మహేంద్ర ప్రైడ్ క్లాస్ రూమ్ నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో తృతీయ సంవత్సరం విద్యార్థినులకు ఉపాధి కల్పన స్కిల్స్‌పై నిర్వహించిన శిక్షణ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ సి.చక్రధరరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగాన్ని పొందడంలో ఉపాధి కల్పన స్కిల్స్ చాలా కీలకపాత్ర పోషిస్తాయన్నారు. అనంతరం శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎంఎం రాజగోపాల్, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఎవి ప్రసాద్, ఎఒ ఎ.శ్రీనాథ్, ప్లేస్‌మెంట్ అధికారి ఎస్.సాయిరామ్, మహేంద్ర ప్రైడ్ క్లాస్ రూమ్ నాంది ఫౌండేషన్ శిక్షణ అధికారులు వై.శ్రేణివాసరావు, వై.హరికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

అనంతపురం : నగరంలోని డాక్టర్ కెఎస్ ఆర్ గఫూర్ హాస్పిటల్స్ డాక్టర్ అబ్దుల్‌రజాక్ గఫూర్ సహకారాలతో ఆదివారం స్థానిక బేరాక అనాథాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సుమారు 80 మంది అనాథలు, మతిస్థిమితం లేని అనాథలకు వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త నాళం వెంకట సుబ్రమణ్యం, డాక్టర్ గఫూర్, ఆశ్రమ నిర్వాహకులు శ్రీరాములు, ధర్మపత్ని ప్రమీలమ్మ, డాక్టర్ మమతశ్రీ, సిస్టర్స్ నవ్య, మమత, ఆశ్రయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P NO:47/2024 in O.S NO:199/2020

Between:

ఎస్ ధర్మపురి రోశి రెడ్డి S/o ఎస్.గంగిరెడ్డి, వ్యవసాయదారుడు, గంగాదేవి పల్లి గ్రామము, తాడిపత్రి మండలము, అనంతపురం జిల్లా ...వాది

AND

నంద్యాల గోపాల్ S/o బాల నారాయణ, వ్యవసాయదారుడు, గంగాదేవి పల్లి గ్రామము, తాడిపత్రి మండలం, అనంతపురం జిల్లా ...ప్రతివాది

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా ప్రతివాది అయిన మీకు తెలియజేయడం ఏమనగా పై కోర్టు నందు మీ పైన వాది అయిన ఎస్ ధర్మపురి రోశి రెడ్డి పై అర్జీని మీరు E.P షెడ్యూల్ దాఖలా ఆస్తికి సంబంధించి కోర్టు వారి ఆదేశం మేరకు రిజిస్టర్ పత్రం రాయించవలసిందిగా మీ పై దాఖలు చేసుకొని ఉన్నాడు సదరు E.P 23-09-2025 తేదీ నాటికి మీ హాజరు నిమిత్తము వాయిదా ఉన్నది కావున 23-09-2025 తేదీనాడు ఉదయం 10.30 గంటలకు పై కోర్టువారి నందు స్వతహాగాని లేదా న్యాయవాది ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవచ్చును. లేని యెడల పై దావా మీ పరోక్షములో తీర్మానించబడును అని మీకు తెలియజేయడమైనది.

(పై ప్రకటన కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

పి.వి.ప్రతాప్ రెడ్డి, బి.ఎ.బి.యల్,
పి.మౌర్య కుమార్ రెడ్డి, బి.బి.ఎ, యల్.యల్.బి,
న్యాయవాదులు, తాడిపత్రి,
అనంతపురం జిల్లా
చరవాణిల నెంబర్ 9848533771,
7013402879

మనోభావాలకు భంగం కలిగితే ఉద్యమిస్తాం

ప్రజాశక్తి-యాడికి

నాయీబ్రాహ్మణుల మనోభావాలకు భంగం వాటిల్లితే ఉద్యమిస్తామని మండల నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు హెచ్చరించారు. బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మ రాజు 'పనిలేని మంగలోడు..పిల్లిబొచ్చు పీకినట్లు' అని చేసిన వ్యాఖ్యలను మండల నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు ఆదివారం ఖండించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే స్థానంలో ఉండి కులం పేరుతో వ్యాఖ్యలు చేయడం వల్ల నాయీబ్రాహ్మణుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం సభ్యులు రామేశ్వరుడు, సంజీవరాయుడు, రామసుబ్బయ్య, లక్ష్మీనారాయణ, ఓబులేసు, వెంకట రంగనాయకులు, నారాయణస్వామి, అశోక్, నరేష్, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, రంగనాథ్, శ్రీరంగ రామాంజనేయులు, బాలాంజనేయులు, కృష్ణ, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు 'వెలుగు'లో చీకటి..!

భార్యల స్థానంలో భర్తలు చెలామణి

ఆందోళనలో మహిళలు

ఆత్మకూరులోని వెలుగు కార్యాలయం

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో చీకటి కమ్ముకుంది. వెలుగు మండల శాఖ అధికారులు స్థానిక వెలుగు సిబ్బంది పనితీరుపై అలసత్వం ప్రదర్శించడం వల్లే 'యథారాజా.. తథాప్రజా' అన్న చందంగా తయారయ్యిందని ప్రజలు, మహిళలు ఆరోపిస్తున్నారు. మండల సమాఖ్య కేంద్ర కార్యాలయం మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు దూరంగా ఉండటంతో అధికారులు, సిబ్బంది 'ఆడిందే ఆట పాడిందే పాట'గా విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా సతుల స్థానంలో పతులు పనులు చేస్తున్నట్లు తెలుస్తోంది. పేరుకే మహిళా యానిమేటర్లు... గ్రామసంఘాల్లో పెత్తనమంతా వారి భర్తలే చెలాయిస్తున్నట్లు సమాచారం. సాధారణంగా మహిళాల సంఘాల్లో మహిళలే పని చేయాలని. అయితే మహిళలకు బదులుగా వారి భర్తలు సంఘాల నిర్వహణ చేపడుతున్నట్లు మహిళలు వాపోతున్నారు. ముఖ్యంగా గ్రామసంఘాల రుణాల మంజూరు చేయాలన్నా, వసూలు రికవరీ చేయాలన్నా, పుస్తకాలు నిర్వహణతోపాటు మండల సమైక్యలో నిర్వహించే సమావేశాలకు సైతం మహిళలకు బదులుగా భర్తలు హాజరవుతున్నా పట్టించుకునే నాథుడే లేడని మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి యానిమేటర్ల స్థానంలో మహిళలే పని చేసేలా చర్యలు తీసుకోవాలని మండల మహిళలు కోరుతున్నారు.

'అక్షర విన్యాసాలు, గేయాలు' పుస్తకావిష్కరణ

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం

కళ్యాణదుర్గానికి చెందిన సాంఘిక సంక్షేమ శాఖ విశ్రాంత ఉపసంచాలకులు, కవి, రచయిత అగ్రహారం సత్యనారాయణ రచించిన 'అక్షర విన్యాసాలు, గేయాలు' అనే పుస్తకాలు, పాటలను ఆదివారం నగరంలోని ఎన్‌జిఒ హోంలో ఆవిష్కరించారు. అగ్రహారం బిక్కి నాగమ్మ స్మారక సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త శాంతి నారాయణ ఆవిష్కరించి మాట్లాడుతూ ఈ పుస్తకాలు ప్రస్తుతం సమాజానికి ఎంతో ఆవశ్యకత కలిగిన అమూల్యమైన గ్రంథాలు అని ప్రశంసించారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ కవి, సాహితీ విమర్శకుడు డాక్టర్ రాజారామ్ రచయిత కృషి ఏ భాషా పరిశోధకులకూ తీసిపోదని కొనియాడారు. అక్షర విన్యాసాలు పుస్తకాన్ని సమీక్షించిన కవి, రచయిత, విమర్శకుడు, సాహితీ పరిశోధకుడు అంకే శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ పుస్తకం మరో పెద్దబాలశిక్షలా చరిత్రలో నిలిచిపోతుందని ఉద్ఘాటించారు. ఈ పుస్తకం కేవలం ఓ పాటల పుస్తకం కాదని, పాటల రూపంలో ఉన్న రచయిత తాను తన జీవితకాలంలో అనుభవించిన, చవిచూసిన అనుభవసారమని సంగీతకారుడు, కథా రచయిత, చరిత్ర పరిశోధకుడు, సామాజిక విశ్లేషకుడు సంగీతవాణీ అడవాల శేషగిరి రాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులు పద్యకవి గురువేపల్లి నరశింహులు, రచయిత అగ్రహారం సత్యనారాయణ, అనంత యువకవి యాములపల్లె నర్సిరెడ్డి, జిల్లావ్యాప్తంగా పెద్దసంఖ్యలో కవులు, రచయితలు, కళాకారులు, సాహితీ అభిమానులు, తెలుగు భాషా ప్రేమికులు పాల్గొన్నారు.

ఎస్సీలు అన్నిరంగాల్లో రాణించాలి

సామాజిక సమరసత వేదిక జాతీయ కన్వీనర్ శ్యామ్‌ప్రసాద్

సమావేశంలో మాట్లాడుతున్న శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎస్సీ కులాలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలని సామాజిక సమరసత వేదిక జాతీయ కన్వీనర్ శ్యామ్‌పసాద్ అన్నారు. ఆదివారం నగరంలోని సాయికృష్ణ ఫంక్షన్ హాల్లో ఎస్సీ కులాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ కులాలకు అందరికీ సమాన హక్కులు సమాన గౌరవం దక్కాలన్నారు. రాయలసీమ జిల్లాల్లోని గ్రామాల్లో ఇంకా అంటరానితనం కనిపిస్తోందన్నారు. సామాజిక సమరసత వేదిక అన్ని కులాల మధ్య సోదరభావం పెంపొందించి అంతరాలు తొలగించడమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. ఎస్సీల్లో ఉన్న 59 కులాల్లో ఎవరు ఎక్కువ కాదు.. ఎవరు తక్కువ కాదు.. అందరూ సమానమేనన్నారు. రాజ్యాంగం ఏర్పడిన నాటి నుంచి కొన్ని కులాల వారికి విద్యా ఉద్యోగ అవకాశాలు అందలేదన్నారు. ఈ విషయంపై సమగ్ర విషయ సేకరణ నిమిత్తం రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ కులాల ఆత్మీయ సమావేశాలు నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో హైకోర్టు న్యాయవాది గంగప్ప, శృంగేరి విరూపాక్ష మఠం పీఠాధిపతి విద్యానృసింహ భారతి మహాస్వామి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షులు గరికిముక్కు సుబ్బయ్య, సామాజిక సమరసత వేదిక ప్రాంత సహసంయోజక్ రాజారామచంద్ర, అనంతపురం విభాగ్ సంయోజక్ రవీంద్రనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గత ఐదేళ్లలో చేయని అభివృద్ధిని చేసి చూపించాం

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గత ఐదేళ్లలో వైసిపి చేయని అభివృద్ధిని ఏడాదిలోపే చేసి చూపిస్తున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఆదివారం నగరంలోని హౌసింగ్ బోర్డులో ఉన్న రామ్‌నరేష్ ఫంక్షన్ హాల్ వద్ద నూతన బీటీ రోడ్డు, డివైడర్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో నగరంలో అధ్వాన్న పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కేవలం జాతీయ రహదారి విస్తరణ పనులు చేశామని గొప్పలు చెప్పుకోవడం తప్ప చేసిందేమీ లేదన్నారు. కనీసం డ్రెయినేజీ వ్యవస్థ గురించి పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే నగరంలో రోడ్లు, డ్రెయినేజీలను నిర్మిస్తున్నామన్నారు. 30ఏళ్లుగా ప్రజలకు ఇబ్బందిగా మారిన డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారం చూపిస్తామన్నారు. త్వరలోనే చెత్త లేకుండా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బాలాస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, దూదేకుల ఫెడరేషన్ డైరెక్టర్ ఇమామ్‌హుస్సేన్, శాప్ డైరెక్టర్ బొమ్మినేని శివ, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌యాదవ్, టిడిపి నాయకులు తమ్మినేని వేణు, మున్వర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో ఆ 11 మిగలవు..

ఒక అబద్ధాన్ని పదే పదే చెబుతూ ప్రజల్ని భయాందోళనకు గురి చేస్తున్న మాజీ సిఎం జగన్ రెడ్డికి.. వచ్చే ఎన్నికల్లో ఆ 11 స్థానాలు కూడా మిగలకుండా పోతాయని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఆదివారం నగరంలోని అర్బన్ టిడిపి కార్యాలయంలో 33 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.41.50లక్షల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడిచిన 15 నెలల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్క అనంతపురం నియోజకవర్గానికే రూ.3కోట్లకుపైగా సిఎంఆర్ఎఫ్ కింద సాయం చేసినట్లు చెప్పారు.

పూజలు చేస్తున్న తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి

అశ్వర్థ నారాయణస్వామిని దర్శించుకున్న జెసి

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని పవిత్ర పుణ్యక్షేత్రం అశ్వర్థ నారాయణస్వామి, భవానీ భీమలింగేశ్వర స్వామివార్లను మాజీ ఎమ్మెల్యే, మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, ఇఒ సుబ్రమణ్యం ఆలయ సంప్రదాయాలతో పూజలు చేశారు. ఆదివారం అమావాస్య కావడంతో రేపటి నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్న సందర్భంగా వర్షాలు బాగా కురిసి రైతులందరూ సుభిక్షంగా ఉండాలని కోరుతున్నారు. అనంతరం అనంతరం ఆలయ ఇఒ సుబ్రమణ్యం శాలువా కప్పి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువులు టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

22నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

యాడికి : మండల కేంద్రంలోని మెయిన్ బజార్‌లో వెలసిన పెద్దమ్మ తల్లి, సంత మార్కెట్ వీధిలో వెలసిన చౌడేశ్వరీదేవి, కోనరోడ్డులో ఉన్న చౌడేశ్వరీదేవి ఆలయాల్లో ఈనెల 22 నుంచి అక్టోబర్ 3వతేదీ వరకూ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయా ఆలయాల కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఆయా రోజుల్లో ఉదయం సుప్రభాత సేవ, గంగపూజ, పంచామృతాభిషేకం, నూతన వస్త్రాల సమర్పణ, నైవేద్యం సమర్పణ, హోమం వంటి పూజలు చేయనున్నట్లు తెలిపారు.

ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని సరస్వతీ విద్యామందిరంలో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్, కిమ్స్ సవేరా ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా దాదాపు 200 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు చేశారు. తర్వాత అనారోగ్యంతో బాధపడుతున్న వారికి 50శాతం రాయితీతో వైద్యం అందించనున్నట్లు కిమ్స్ సమీరా వైద్యులు తెలిపారు. అనంతరం వైద్య శిబిరానికి సహకరించిన ఎస్‌విఎం అధినేత మొరుసు సంజీవరెడ్డిని వైద్యులు సన్మానించారు. ఈకార్యక్రమంలో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ నేషనల్ ఛైర్మన్ మొహమ్మద్ ముజాహిద్, కార్డియాలాజీ సుదర్శన్, పిడియాట్రిక్ గిరీష్, ఆర్థో ఆదిత్య, గైనకాజిస్ట్ మేఘన, జరల్ మెడిసిన్ డాక్టర్ సతీష్, ఆప్తమాలజీ ఇర్ఫాన్, ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం

నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి ఓ పేద కుటుంబానికి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందించారు. ఆమె తెలిపిన వివరాల మేరకు... కళ్యాణదుర్గం మండలం ఎనుములపల్లి గ్రామానికి చెందిన త్రివేణి భర్త ప్రమాదవశాత్తు మరణించారు. ఈమెకు ముగ్గురు చిన్నారులు ఉన్నారు. కుటుంబ ఆర్థిక ఇబ్బందులను గమనించిన నిర్మల మురళి ఆదివారం పుట్టినిల్లు ఆశ్రమంలో సాయం అందించారు. ట్రస్టు సభ్యులు ఎన్.హరినాథ్‌రెడ్డి, సతీమణి సౌజన్య కుమార్తె ఎన్.మునిపల్లవి పుట్టినరోజు సందర్భంగా రెండు నెలలకు సరిపడా 34 రకాల నిత్యావసర వస్తువులు, బియ్యం ప్యాకెట్, రూ.2 వేల నగదును అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు ఉపాధ్యక్షుడు కవిన్ ఆదిత్య, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

'ఎడిపై'కి ఎమర్జింగ్ స్కూల్ ఇన్ ట్రాన్స్‌ఫర్మేషన్ లెర్నింగ్ అవార్డు

అవార్డు అందుకుంటున్న కామేశ్వరి

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ఎడిపై వరల్డ్ స్కూల్‌కు 'ఎమర్జింగ్ స్కూల్ ఇన్ ట్రాన్స్‌ఫర్మేషన్ లెర్నింగ్' అవార్డు లభించింది. ఈమేరకు సివిల్ సప్లయ్ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో స్కూల్ కరస్పాండెంట్ కామేశ్వరి అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ స్కూల్‌కు అవార్డు రావడం అంత్యంత గర్వకారణమన్నారు. ఈ అవార్డు మరింత బాధ్యత పెంచిందన్నారు.

ఆలయానికి విరాళం

పెద్దవడుగూరు : పెద్దవడుగూరు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న వీరభద్రస్వామి ఆలయానికి చిన్నవడుగూరుకు చెందిన యువ నాయకులు దివాకరరెడ్డి ఆదివారం రూ.50వేలు విరాళం అందజేశారు. ఆయా మొత్తాన్ని కమిటీ సభ్యులకు అందించారు. అనంతరం దివాకరరెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

శ్మశాన స్థలంపై వాగ్వాదం

పెద్దవడుగూరు : మండలంలోని చిన్నవడుగూరులో శ్మశాన స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించుకున్నారనే నేపంతో గ్రామస్థులు ఆదివారం తొలగించాలని ప్రయత్నం చేయగా ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. గ్రామసమీపంలో సర్వేనెంబర్ 111లో 3.33 ఎకరాల ప్రభుత్వం భూమి ఉంది. ఈస్థలాన్ని అప్పట్లో ప్రభుత్వం శ్మశానానికి ఇచ్చింది. అయితే గ్రామానికి చెందిన 11 మంది కొంత స్థలాన్ని ఆక్రమించుకున్నారు. దీంతో శ్మశానవాటిక కుంచించుకుపోయింది. ఈనేపథ్యంలో అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు చర్యలు తీసుకుంటున్న తరుణంలో ఆక్రమించుకున్న వ్యక్తులు అడ్డుకున్నారు. తమస్థలం కోర్టుకు వేశామని చెప్పారు. ప్రభుత్వ స్థలాన్ని కోర్టుకు వేయడం ఏంటని ప్రశ్నించారు. ఏదిఏమైనా రెవెన్యూ అధికారులు వచ్చి వీటికి పరిష్కారం చూపాల్సి ఉంది.

'గురజాడ'కు నివాళి

రాయదుర్గం : సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని సమైక్యాంధ్ర భవన్‌లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాయదుర్గం శాఖ అధ్యక్షులు శివానంద, కార్యదర్శి నాగరాజు, గౌరవాధ్యక్షులు వీరేష్, ఎన్జీవోల సంఘం అధ్యక్షులు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి క్రీడలు అవసరం

అనంతపురం : ఆరోగ్యానికి క్రీడలు చాలా అవసరమనిఎపి ఒలింపిక్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మచ్చా రామలింగారెడ్డి అన్నారు. అనంతపురం జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు గురుస్వామి, సీనియర్ కోచ్ శాంతరాజ్, తైక్వాండో శిక్షకులు కేశవయ్య, మనీంద్ర, వెంకటేశులు, సాయితేజ, అంజూమ్, సానియా, కృష్ణబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురంలోని కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు తెలిపారు. కావున జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

1100 సేవలను వినియోగించుకోండి

మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నెంబర్‌కు కాల్ చేసి చెప్పవచ్చున్నారు. అర్జీదారులు తమ అర్జీలను నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో అర్జీలను నమోదు చేసుకోవచ్చన్నారు.

మహా అమావాస్య ప్రత్యేక పూజలు

ఆత్మకూరు : మహా అమావాస్య సందర్భంగా ఆదివారం మండలంలోని పంపనూరు గ్రామంలో వెలసిన సుబ్రమణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా పాలాభిషేకం, పంచామృతాభిషేకం, అలంకరణ, ఆకుపూజ, అర్చన, మహానైవేద్యం, మహా మంగళహారతి, పల్లకిసేవ, కుజదోష, కాలసర్పదోష, సర్పదోష, నివారణ కోసం మూలమంత్ర బీజాక్షర హోమం వంటి కార్యక్రమాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేసినట్లు ఆలయ నిర్వహణ అధికారి బాబు తెలిపారు.

సాంబశివారెడ్డికి సన్మానం

శింగనమల : మండల పరిధిలోని ఈస్టు నరసాపురం గ్రామంలో ఉన్న వైసిపి సీనియర్ నాయకులు శ్రీరామిరెడ్డి నివాసంలో వైసిపి స్టేట్ అడ్మిన్ హెడ్ ఆలూరు సాంబశివారెడ్డిని తరిమెలకు చెందిన వైసిపి నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఆలూరు బాలిరెడ్డి, ఎల్లూరి గోవర్ధన్‌రెడ్డి, ఎల్లూరి కిట్టు రెడ్డి, గౌరవ మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపుపై చర్యకు వినతి

రాయదుర్గం : గుమ్మఘట్ట మండలం సిరిగేదొడ్డి గ్రామ సమీపంలో పొలంలో పెద్దఎత్తున నిల్వ ఉంచిన ఇసుకడంపును పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయాలని బహుజన సమాజ్ పార్టీ రాయలసీమ ఇన్‌ఛార్జి చిందనూరు నాగరాజు విజ్ఞప్తి చేశారు. రాయదుర్గం రూరల్ సిఐ శనివారం గుమ్మఘట్ట మండలంలోని ఒకచోట నిల్వ ఉంచిన ఇసుకను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారన్నారు. ఎవరైనా అక్రమంగా ఇసుక నిల్వ చేసినా.. అక్రమ రవాణా చేసినా చర్యలు తీసుకుంటామని రూరల్ సిఐ చెప్పిన విషయం గుర్తు చేశారు. అయితే ఇందుకు విరుద్ధంగా సమీపంలోనే టిడిపి ముఖ్య నాయకుడి బంధువు పెద్దఎత్తున ఇసుకను నిల్వ ఉంచినప్పటికీ ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. విషయంపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించి ఇసుక అక్రమ రవాణా అడ్డుకట్ట వేయాలని నాగరాజు కోరారు.

నేరాలు ఘోరాలు

చీనీచెట్ల నరికివేత

బెలుగుప్ప : మండల పరిధిలోని విరుపాపల్లి గ్రామంలో రైతు బోయ హరికృష్ణ సాగు చేసిన 100 చీనీ చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికేసిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు.. తనకున్న ఐదెకరాల పొలంలో 500 చీనీచెట్లు నాటారు. ఇందుకు అంతర్గత పంటగా వేరుశెనగ సాగు చేశాడు. ఈనేపథ్యంలో దాదాపు కాపు దశ సమయంలో ఉన్న చీనీచెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో దాదాపు రూ.3లక్షల నష్టం వాటిలిందని వాపోయాడు. ఆదివారం బెలుగుప్ప పోలీస్‌స్టేషన్‌లో కేసు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న ఎస్ఐ శివ పొలానికి చేరుకుని నరికిన చీనీచెట్లను పరిశీలించారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎలుగుబంటి దాడి., ఇద్దరికి గాయాలు

రాయదుర్గం : గుమ్మఘట్ట మండలం అడగుప్ప గ్రామానికి చెందిన ఇద్దరు యువకులపై ఆదివారం ఎలుగుబంటి దాడి చేసి గాయపరిచింది. గ్రామానికి చెందిన రామాంజనేయులు, చంద్ర కలిసి సీతాఫలం కాయలు కోసుకునేందుకు సమీపంలోని కొండకు వెళ్లారు. సీతాఫలం కాయలు కోస్తుండగా అకస్మాత్తుగా ఎలుగుబంటి దాడి చేసి గాయపరిచింది. గమణించిన గ్రామస్తులు వారిని రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ అడగుప్ప కొండపై దట్టంగా చెట్లు ఉండటంతో పదుల సంఖ్యలో ఎలుగుబంట్లు నివాసం ఏర్పరచుకున్నాయన్నారు. అక్కడ సీతాఫలం చెట్ల నుంచి పండ్లు, కాయలను తీసుకురావడానికి వెళ్లినప్పుడు, మేతకై పశువులు , మేకలు తీసుకువెళ్లినప్పుడు తరచూ ఎలుగుబంట్లు దాడి చేస్తున్నాయని వాపోయారు. వెంటనే ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.